## సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**సైఫాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ విద్యార్థి సాత్విక్ ఆత్మహత్యకు కారణమైన యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వామ పక్ష విద్యార్థి సంఘాలు గురువారం బషీర్‌బాగ్‌లోని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టాయి. ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు రోడ్డు మీద బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కొంత సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. విద్యార్థులు రోడ్డుకు అడ్డంగా పడుకుని నినాదాలు చేశారు. అంతకు ముందు విద్యార్థిలు నిజాం కళాశాల ప్రాంగణం నుంచి మంత్రి కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థి నాయకులు మా ట్లాడుతూ నారాయణ, శ్రీచైతన్య కళాశాలలను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయా లని, వాటిని ప్రభుత్వమే స్వాదీనం చేసుకుని నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కళాశాలలో యాజమాన్యాలు వత్తిళ్ళకు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే ఇంటర్ బోర్డు, విద్యా శాఖ మంత్రి పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నదని ధ్వజమెత్తారు. సాత్విక్ మృతిపై సమగ్రంగా విచారణ జరిపించాలని, కళాశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు.



హైదరాబాద్ వార్త

# మోడి సర్కార్ పతనం వంటింటితోనే ప్రారంభం

**-మంత్రి సబితా ఇంద్రారెడ్డి**
**-పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా మంత్రి ఆధ్వర్యంలో మహా ధర్నా**
**-వందలాది మంది మహిళలతో పాదయాత్ర**
**-కట్టెల మోపులతో వినూత్న నిరసన**



కట్టెల మోపుతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:**
కేంద్రంలో మోడి సర్కార్ పతనం మహిళల వంటింటి నుండే ప్రారంభం అవుతుందని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. వంట గ్యాస్ ధరలు పెంచి ఆర్థిక భారం మోపుతున్న మోడీ ప్రభుత్వాన్ని మహిళలే సాగనంపుతారని ఆమె అన్నారు. మోడి పుణ్యమా అని ప్రజలకు కట్టెల పొయ్యే దిక్కు అయ్యే దుస్థితి నెలకొందని ఆమె ఎద్దేవా చేశారు. పెరిగిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ హైదరాబాద్ నగర శివార్లలోని మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లెలగూడ సంద చెరువు కట్ట నుండి మీర్‌పేట్ చౌరస్తా వరకు వందలాది మంది మహిళలు, బిఆర్ఎస్ శ్రేణులతో పాదయాత్రలు చేస్తూ కట్టెల మోపు ఎత్తుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ధరలు పెంచి సామాన్యుల నడి విరుస్తున్న ప్రధాని మోడి ప్రజలకు ఎలా దేవుడవుతాడని బిజెపి నేతలను ప్రశ్నించారు. సిలిండర్ ధర రూ.1155 వరకు పెంచిన బిజెపి నేతలు ఏ ముఖం పెట్టుకొని ప్రజల వద్దకు వస్తారని ఆమె అన్నారు. స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు వచ్చే బిజెపి నేతలను పెంచిన గ్యాస్ ధరలపై నిలదీయాలని సబితారెడ్డి మహిళలకు పిలుపునిచ్చారు. ఇక సాలు మోడి ఇక నీకు సెలవు మోడీ అనే నినాదంతో మహిళలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని ఆమె సూచించారు. బిజెపికి మళ్ళీ ఓట్లు వేస్తే వంటింట్లో గ్యాస్ సిలిండర్ బదులు కట్టెల పొయ్యి పెట్టుకునే దుస్థితి దాపురిస్తుందని ఆమె హెచ్చరించారు. అనంతరం బిఆర్ఎస్ నేతలు మీర్‌పేట్ చౌరస్తాలో కట్టెల పొయ్యిని వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు పద్మారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

# కాసులు పండిస్తున్న కోచింగ్ కేంద్రాలు

## నిరుద్యోగుల నుంచి భారీగా వసూళ్ళు

**హైదరాబాద్, మార్చి 2 ప్రభాతవార్త**
నిరుద్యోగుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని నగరంలో పోటీ పరీక్షలకు సంబంధించిన కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా ప్రభుత్వ నిఘా లేకపోవడంతో విచ్చలవిడిగా వారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. కోచింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమమతులు అవసరం లేకపోవడంతో అనివార్యకారణాల వల్ల మూతబడిన కేంద్రాలు తిరిగి పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వివిధ సబ్జెక్టుల్లో గుర్తింపు కలిగిన నిపుణులతో కోచింగ్ నిర్వహిస్తామంటూ కొంతమంది బూటకపు ప్రకటనలతో నిరుద్యోగులను బూరడి కొట్టించే కార్యక్రమానికి శ్రీకారంచుడుతున్నాయి ఒక్కో బ్యాచ్‌లో కనీసం 500 మంది వరకు తగ్గకుండా రోజుకు నాలుగు బ్యాచ్‌ల చొప్పున శిక్షణ నిర్వహిస్తున్నాయి. కొన్ని చోట్ల మరికొన్ని ఆడిటోరియంలు, అపార్ట్‌మెంట్‌లను అద్దెకు తీసుకుని మరీ కోచింగ్ ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా ఫంక్షన్ హాళ్ళను కూడా బుకింగ్ చేసుకుని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కోచింగ్ కేంద్రాల నిర్వహణకు అడ్డాగా ఉన్న అశోక్‌నగర్‌లో ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ప్రాంతంతో పాటు దిల్‌సుఖ్‌నగర్, అశోక్‌నగర్, చిక్కడపల్లి, ఎస్ఆర్.నగర్, అమీర్‌పేట, కూకట్‌పల్లి తదితర ప్రాంతాలలో 1200 వరకు కోచింగ్ కేంద్రాలుండగా ప్రస్తుతం ఇందులో దాదాపు లక్షకుపైగా నిరుద్యోగ యువతీ, యువకులు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి కోచింగ్ ఫీజు కింద రూ.30వేల నుంచి రూ.35వేలు, హాస్టల్ ఫీజునెలకు రూ.6వేలు వసూలు చేస్తున్నారు. ఈ విధంగా ఇబ్బడ ముబ్బడిగా వసూలు చేస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేద విద్యార్థులఉు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాలన్నీ కోవిడ్ తర్వాత మళ్లీ పూర్వవైభవం సంతరించుకున్నారు. గ్రూప్ పరీక్షలకు సంబంధించి ఫీజును కూడా 20 నుంచి 40శాతం పెంచేశారు కూడా. అశోక్‌నగర్‌లోని ఓ కోచింగ్ కేంద్రంలో సివిల్స్ కోచింగ్‌కు రూ.1.80లక్షలు తీసుకుంటుండగా, గ్రూప్-1 మెయిన్స్‌కు రూ.50వేల నుంచి రూ.55వేలు వసూలు చేస్తున్నారు. గ్రూప్-2 రెండు నెలల శిక్షణకు రూ.33వేలు వసూలు చేస్తున్నారు. అదనంగా ఫీజుతో పాటు జీఎస్టీని కూడా వసూలు చేస్తుండడం గమనార్హం. ఒకవైపు మోయలేని భారంగా ఉన్న ఫీజు, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ఉండడంతో సతమతమవుతున్నారు. ఫలితంగా చాలా మంది నిరుద్యోగులు అప్పులు చేసి మరీ చదువుకుంటున్నారు. ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ కోచింగ్ కేంద్రాలలో అధిక ఫీజులను నియంత్రించాలని విద్యార్థి సంఘాల నేతలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వంపై వత్తిడి కూడా తీసుకువచ్చారు. ఉద్యోగ నోటిఫికేషన్‌ల కాలం కావడంతో నిరుద్యోగ



యువతకు కేంద్రాలు అడిగినంత డబ్బును అప్పులు చేసి మరీ కోచింగ్ తీసుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. ఎలాగైన తమ కుటుంబ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా యువత కోచింగ్ తీసుకుని విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఎస్ఐ, కానిస్టేబుల్, ప్రిలిమినరీ, గ్రూప్-1 ప్రిలీమ్స్ పరీక్షలు నిర్వహించి ఫలితాల వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన యువత మెయిన్స్‌కు సిద్ధమవుతున్నారు. మరోవైపు గ్రూప్-2, గ్రూప్-4, గ్రూప్-3 పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఉద్యోగాలు సాధించాలనే ఆశతో కోచింగ్ కేంద్రాలపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆయా ఉద్యోగాలకు ప్రభుత్వం వయపరిమితిని సడలించడంతో అర్హత ఉన్న వవారు కూడా ప్రైవేట్ ఉద్యోగాలను పక్కనపెట్టి మరీ కోచింగ్ తీసుకుంటున్నారు.

# క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడారంగాల్లో ప్రతిభ కనబర్చాలి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు

**కంటోన్మెంట్,మార్చి 2 ప్రభాతవార్త:**
ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఇచ్చిన పిలుపు మేరకు దేశంలో క్రీడా పోటీలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తున్నామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో పార్లమెంట్ పరిధిలోని క్రీడాకారులకు బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో తెలంగాణ జీతో తెలంగాణ స్పోర్ట్స్ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాలు విజేత క్రీడాకారులకు బహుమతుల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. రాబోయే 25 సంవత్సరాల్లో ప్రపంచంలో అన్ని రకాల ఆటల పోటీలకు భారత దేశ క్రీడాకారులు ముందు వరుసలో ఉంటారన్నారు. క్రీడాకారులు ఇటీవల దేశంలో నిర్వహించిన పోటీలలో 7200 పాల్గొన్నారన్నారు. క్రికెట్,కబడీ, ఖోఖో, పుట్‌బాల్ వంటి పోటీల్లో ఉత్సాహాన్ని చూపడానికి, వారిని మరింత ప్రోత్సహిస్తే వారు ఉజ్వల భవిష్యత్తుకు, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకు వస్తారన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు యువతలో ఉత్సాహం ఉంటుందన్నారు. అదే విధంగా వారు రోగాల పాలు కాకుండా క్రీడలు ఎంతోగానో దోహదపడుతాయన్నారు. ఇప్పటి వరకు దేశంలోని క్రీడాకారులు అనేక పతకాలు సాధించారన్నారు. ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహ పడకుండా ప్రాక్టీస్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జి,జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావ్, మాజీ ఎమ్మెల్యేలు జయప్రకాశ్ నారాయణ, చింతల రాంచంద్రారెడ్డి, ఒలింపిక్ కోచర్ ముఖేశ్ యాదవ్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు జె.రామక్రిష్ణ, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, రాంగోపాల్ పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర, బిజెపి నాయకులు సి.హెచ్.కన్నాభిరామ్, జి.హంసరాజ్, ఉదయ్ యాదవ్, తదితంరులు పాల్గొన్నారు.

## గంగపుత్రుల సంక్షేమానికి నిరంతరం పోరాడిన వ్యక్తి ఏ.ఎల్ మల్లయ్య

**మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపి వి.హనుమంతరావు**



మల్లయ్య చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న పొన్నాల,విహెచ్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 2,ప్రభాతవార్త:**
ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు, ఫిషరీస్ కో ఆపరేషన్ సొసైటీ మాజీ చైర్మన్ ఏ.ఎల్ మల్లయ్య గంగపుత్రుల సంక్షేమానికి చేసిన కృషి ఎనలేనిదని 40ఏళ్లుగా రాత్రిపగలు గంగపుత్రుల సంక్షేమానికి కృషి చేసిన మల్లయ్యకు గంగపుత్ర జాతి రుణపడి ఉంటుందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ,మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏ.ఎల్ మల్లయ్య సంతాపసభకు పొన్నాల లక్ష్మయ్య,విహెచ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీకి ఎన్నికలు పెట్టమని డిమాండ్ చేసిన వ్యక్తి మల్లయ్య అన్నారు. అలాగే 50శాతం సబ్సిడీతో చేపల పెంపకం, చేపల మద్దతు ధర వంటి అంశాలపై మల్లయ్య దేశవ్యాప్తంగా పోరాటం చేశారన్నారు. ఆయన పనితీరు ,సామాజిక కోణం సమాజం తలెత్తుకుని తిరిగేలా చేసిన సేవలకు తాము కృతజ్ఞులమన్నారు.మెట్టు సాయి అధ్యక్షన జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు రోహిన్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, మహేందర్ బాబు, చంద్రప్రకాశ్, అమర్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కెబిఆర్ పార్కులో సినీనటిపై వేధింపులు

**యువకుడిని అదుపులోకి తీసుకున్న బంజారాహిల్స్ పోలీసులు**

**హైదరాబాద్, మార్చి 2,ప్రభాతవార్త:**
బంజారాహిల్స్‌లోని కేబిఆర్ పార్కులో ఉదయం 5గంటల కల్లా సామాన్యులతోపాటు ప్రముఖులంతా వచ్చి వాకింగ్ ,జాగింగ్ వంటివి చేస్తుంటారు. అయితే ఇక్కడ కూడా నటీమణులకు వేధింపులు ఎదువుతూనే ఉన్నాయి. గతంలో ఒనటి వేధింపులను ఎదర్కొన్న మాధిరిగానే ఇప్పుడు మరో నటి కేబిఆర్ పార్కులో లైంగిక వేధింపులను ఎదుర్కొన్నది. సమాచారం అందుకున్న పోలీసులు కెబిఆర్ పార్కుకు వెళ్లి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి పార్కులో సినీనటిపై లైంగిక దాడికి యత్నించినట్లు సమాచారం. ఈతరుణంలోనే పార్కులోని వ్యక్తులు సిబ్బంది బంజారాహిల్స్ పోలీసులకు ఆయువకున్ని అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ..దర్యాప్తు చేస్తున్నారు. ఆయువకుడిని అందుపులోకి తీసుకని విచారిస్తున్నారు.

## శ్రీచైతన్య కళాశాల యాజమాన్యంపై హత్యకేసు నమోదు చేయాలి

**బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ నేతల డిమాండ్**

**ధర్నాచౌక్, మార్చి 2, ప్రభాతవార్త:**
ఇంటర్ విద్యార్థి సాత్విక్ మృతికి కారణమైన శ్రీచైతన్య కళాశాల యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రం గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ బి.ఎస్.రావు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పోరేట్ కళాశాలలో కుమ్మక్కై విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోని విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశన కంటే తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కార్పోరేట్ దోపిడీ మరింత పెరిగి, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేస్థాయికి చేరిందన్నారు. ర్యాంకుల పేరుతో ముక్కుపచ్చలారని చిన్నారులను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ ఉంటే, వారు పెట్టే బాధలు భరించలేక విద్యార్థులు ఉరితాళ్లకు వేలాడుతున్నారని ఆరోపించారు. వారం రోజుల క్రితం ఉప్పల్ శ్రీచైతన్యలో ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడగా, నేడు నార్సింగ్ శ్రీచైతన్యలో సాత్విక్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఇవి ఆత్మహత్యలు కాదని, ప్రభుత్వం, కళాశాల యాజమాన్యం చేసిన హత్యలని మండిపడ్డారు. తక్షణమే బి.ఎస్.రావును అరెస్ట్ చేసి, శ్రీచైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని, లేనిపక్షం ప్రగతి భవన్‌ను, శ్రీచైతన్య ప్రధాన కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గొడుగు మహేష్ యాదవ్, బడేసాబ్, బత్తిని రాజు, గూడూరు భాస్కర్, ఇంద్రం రజక తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్ళకు సొంత భవనాలు నిర్మించాలి

**సైఫాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:**
రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాలకు పక్కా భవనాలు కేటాయించాలని సంక్షేమ హాస్టళ్ళ సమస్యల సాధన సమితి కన్వీనర్లు జాడి విలాష్, కోట ఆనంద్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను, కరపత్రాలను వారు అవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రైవేటు భవనాలలో హాస్టళ్ళు, గురుకులాలను కొనసాగిస్తున్నాయని ఆనేక భవనాలు శిదిలావస్థకు చేరుకున్నాయని, దీంతో విద్యార్థులు భయాందోళనలు చెందుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మెస్ చార్జీలను నామ మాత్రంగా పెంచి చేతులు దులుపుకున్నదని, ఈ మెస్ చార్జీలు ఎందుకు సరిపోవని, పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు పెద్ద ఎత్తున చేపడతామని వారు హెచ్చరించారు.

# చెవులు పైలం ..



**-గంటల తరబడి ఇయర్ ఫోన్లతో యువత జల్సా**
**-డీజేలు,లౌడ్ స్పీకర్లతోనూ సమస్యలు**
**-పెరుగుతున్న వినికిడిలోపం బాధితులు**
**-నేడు ప్రపంచ వినికిడి దినోత్సవం**

**హైదరాబాద్, మార్చి 2,ప్రభాతవార్త:**
ఇటీవల కాలంలో వినికిడి లోపంతో బాధపడేవారిసంఖ్య క్రమంగా పెరుగుతుంది. గతంలో 20శాతంగా ఉన్న వినికిడి లోప బాధితులు ప్రస్తుతం 35 నుంచి 40శాతానికి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇయర్ ఫోన్లను ఎక్కువగా వాడుతండటంతో యువత వినికిడి సమస్యలను కొని తెచ్చుకుంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రధాన రహదారుల్లోని వాహనాల వద్ద 85డెసిబెల్స్‌ను మించి ధ్వనులు ఉంటాయి. వీటిని 8గంటల పాటు వింటే వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇయర్ ఫోన్స్‌లో పెద్దశబ్దంతో సంగీతం వినడం ద్వారా 88డెసిబెల్స్ శబ్దం చెవిలోకి ప్రవేశిస్తుంది. ఇలా ఏకధాటిగా 4గంటలు వింటే వినికిడి లోపం ఖాయం అంటున్నారు వైద్యులు. ఇక పెద్దస్థాయి మోటార్లు, బుల్డోజర్లు 90డెసిబెల్స్ శబ్దాన్ని వెలువరిస్తాయి. వీటిని 2గంటలాపటు వింటే చెవుడు వచ్చే అవకాశం ఉంది. 120 డెసిబెల్స్ శబ్దం వింటే కొద్దిక్షణాల్లోనే నొప్పితో పాటు వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక ఇయర్ ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగిస్తే ఆరోగ్యపరమైన ఎన్నో ఇబ్బందులు కలుగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటి ఫంక్షన్ల ద్వారా శబ్దం నేరుగా చెవిలో వెలువడుతుంది. ఫలితంగా సాధారణ వ్యక్తులతో పోలిస్తే వీరికి వినికిడి లోపం వచ్చే అవకాశం అనేక రేట్లు ఎక్కువగా ఉంటుంది. చెవిలో బయట చెవి, మధ్యచెవి, లోపలి చెవి అని మూడు భాగాలుంటాయి. అధికశబ్దాల వల్ల కొన్నిసార్లు ఇన్ఫెక్షన్లకు కూడా దారి తీయొచ్చు. అదేపనిగా ఇయర్‌ఫోన్లను వినియోగిస్తే మనసు స్థిమితం కోల్పోయి చికాకుగా అనిపిస్తుంది.నేరుగా ధ్వని చెవిలోకి చేరడంతో చెవి క్రమంగా నొప్పిగా అనిపించడం, తలనొప్పి ,మెడనొప్పి ,తలతిప్పినట్లు అనిపించడం వంటి సమస్యలు వస్తాయి.

### వీటితో జర జాగ్రత్త ..

ఇటీవల పెళ్ళిళ్లు, బరాత్, దావత్‌లలో డీజేలు హోరెత్తుతున్నాయి. ఇవి లేకుండా ఫంక్షన్లు జరగడం దాదాపు అసాధ్యమయ్యింది. ప్రధానంగా పెళ్ళి బరాత్, క్లబ్, పబ్బుల్లో క్రీడా ప్రాంగణ్యాల్లో ఏర్పాటు చేస్తున్న సంగీత వాయిద్యాలు, భారీ లైడ్ స్పీకర్ల ద్వారా శబ్ద హోరు తీవ్రత చెవిలోపల భాగాలను పాడుచేస్తుంది. కాబట్టి హోరెత్తించే శబ్దాలకు దూరంగా ఉండటం చాలా మంచిందని వైద్యులు చెబుతున్నారు.

## టెలి మెడిసిన్ ద్వారా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి : డాక్టర్ మనోజ్‌రెడ్డి

**సైఫాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** బస్తీ దవాఖానాల్లో, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపిహెచ్‌సీ) రోగుల కోసం ప్రభుత్వం విస్తృత సేవలు అందించడానికి ముందుకు వచ్చిందని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రిజీనల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే ఈ సేవలను ఆనేక మంది రోగులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. కోవిడ్ నమునాల సేకరణ, పరీక్షలు, మందుల కిట్లు పంపిణి జరుగుతున్నదని కరోనా కాలంలో మరో అడుగు ముందుకేసి టెలీ మెడిసిన్ ద్వారా ప్రత్యేక వైద్య సేవలను అందిస్తున్నారని ఆయన వివరించారు. యూపిహెచ్‌సిలకు వచ్చిన దీర్ఘకాలిక రోగులు పెద్దాసుపత్రులకు వెళ్ళకుండానే టెలీమెడిసన్ ద్వారా స్పెషలిస్టులతో సంప్రదింపులు జరిపే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ముందస్తుగానే స్పెషలిస్టులకు రోగుల వివరాలు, వ్యాధి తీవ్రత, ప్రస్తుత ఇబ్బందులతోపాటు అన్ని రిపోర్టులు పంపి వైద్య చికిత్సలు అందిస్తున్నారని చెప్పారు. బస్తీ దవాఖానాల్లోకి వచ్చిన రోగులలో సమస్య తీవ్రంగా ఉంటే బోధనా ఆసుపత్రులకు రిఫర్ చేసి రోగులు అక్కడికి వెళ్ళి క్యూలో నిలబడి వైద్యులను సంప్రదించే అవసరం లేకుండా, ఇబ్బందులు పడకుండా స్థానిక ఆసుపత్రుల నుంచి టెలీ



టెలి మెడిసిన్ ద్వారా సేవలు అందిస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

మెడిసిన్ ద్వారా బోధనా అసుపత్రులలోని వైద్య సేవలు అందిస్తున్నారని ఆయన వివరించారు. ప్రత్యేక సేవలు గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, నెఫ్రాలజీ, ఈఎన్‌టి, చర్మవ్యాదులు, జనరల్ సర్జరీ, ఎండోమైక్రోనాలజీ, ఫిజీయో ధెరపి, గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ సేవలకు స్థానిక ఆసుపత్రులకు వెళ్ళి అక్కడ నుంచి టెలీ మెడిసన్ ద్వారా సేవలు పోందువచ్చునని డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలంటూ

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

**యూసుఫ్‌గూడ, మార్చి 2, ప్రభాతవార్త**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని జూబ్లిహిల్స్ నియజకవర్గం యూసుఫ్‌గూడ చౌరస్తాలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు యూసుఫ్‌గూడ చౌరస్తాలో హైదరాబాద్ బిఆర్ఎస్ అధ్యక్షులు, జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ ఆధ్వ ర్యంలో నియజకవర్గంలోని అన్ని డివిజన్‌ల బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో కాళీ సిలిండర్‌లతో నిరసన నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గ్యాస్ ధరలను పెంచి మహిళ లకు కానుకగా ఇచ్చారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం వారి అభివృద్ధి కోసం ఆలోచించే ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అనీ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్‌కిట్, డ్వాక్రా ఋణాలు, షీటీమ్, తదితర పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. పేదవాడి నడ్డి విరిచి ఆదాని లాంటి పెద్దవాళ్ళకు దోచిపెడుతున్నారని అన్నారు. ఆడపడుచుల ఆగ్రహం, ఎలా ఉంటుందో త్వరలోనే మోడీ చూస్తారని అన్నారు. ఈసందర్భంగా కట్టెల పొయ్యితో మహిళలు వంట వార్పు నిర్వహించారు. ఈకార్యక్రమంలో యూసుఫ్‌గూడ కార్పోరేటర్ రాజ్‌కుమార్ పటేల్, వెంగళరావు నగర్ కార్పొరేటర్ దేదిప్యవిజయ్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి, డివిజన్‌ల అధ్యక్షులు డి సంజీవ, సంతోష్, కృష్ణమోహన్, మన్సూర్, జిటియస్ దేవాలయం చైర్మన్ చిన్నరమేష్, విజయ్‌సింహ, సిరాజ్, సింగారి శ్రీనువాస్, శ్యామ్‌రావు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

**బోరబండ బస్టాండు వద్ద...**

నిత్యవసర సరుకుల ధరలతో ప్రజలు సతమతమవుతుంటే గ్యాస్ ధరలు మరింత పెంచడంతో భారంగా మారిందని గ్యాస్ ధరలు తగ్గించాలని దేశ వ్యాప్తంగా ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఇందుకు గాను గ్యాస్ ధరల పెంపు నిరసిస్తూ సిఎం కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో బోరబండ బస్టాండు చౌరస్తాలో మార్చి 3వతేది శుక్రవారం ఉదయం 10గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరగుతుందని దీనికి హైదరాబాద్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ పాల్గొంటారని బోరబండ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణమోహన్ తెలిపారు. పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి నిరసన తెలపాలని పేర్కొన్నారు.

### గ్యాస్ ధరల పెంపుతో ప్రజల్లో వ్యతిరేకత

**యూసుప్‌గూడ, మార్చి 2, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం పేదలను నడ్డివిరిచేలా వంటగ్యాస్ ధరలను పెంచడంతో ప్రజల్లో పూర్తి వ్యతిరేకత మొదలైందని కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్నారు. గురువారం డివిజన్‌లోని పర్వత్‌నగర్ చౌరస్తాలో వంటగ్యాస్ ధరలను పెంచడంపై వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్దం చేశారు. ఈకార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, జాహేద్ షరీఫ్, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్, సి.బ్రహ్మ, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్ఆర్‌టిపి ఆధ్వర్యంలో...**

**యూసుఫ్‌గూడ, మార్చి 2, ప్రభాతవార్త :** వైఎస్సార్ తెలంగాణ పార్టీ జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా వాడుక రాజగోపాల్ నియమించబడ్డారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు సిద్దార్థనగర్‌కు చెందిన వాడుక రాజగోపాల్‌ను జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా నియమించడం జరిగింది.వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన వాడుక రాజగోపాల్ వైఎస్ షర్మిక పార్టీపెట్టిన మొదటినుండే ఆపార్టీ కార్యమాలకు కోఆర్డినేటర్‌గా, జిహెచ్‌ఎమ్‌సి అధ్యక్షునిగా పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించారు. పార్టీకి సంబందించిన ప్రతి కార్యక్రమంలో ముందుండి నడిపిస్తున్నారు. జిహెచ్‌ఎమ్‌సి పరిదిలోని పార్టీ అభివృద్ధికోసం విశేషమైన కృషిచేస్తూ వస్తున్నారు. ఈసందర్భంగా వాడుక రాజగోపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జూబ్లిహిల్స్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిన వైఎస్ షర్మిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో వైఎస్ఆర్‌పార్టీని బలోపేతం చేసే దిశగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ సంక్షేమ పథకాలను ప్రజలు నేటికి మరిచిపోలేదని ఆరోగ్య శ్రీ, 108, ఫీజ్‌రియింబర్స్ మెంట్, మహిళలకు పావల వడ్డీ రుణాలు వంటి ఎన్నో పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తుచేశారు. ప్రజలకు నేడు ఆపథకాలు ఏవి అందడం లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్ళీ వైఎస్సార్ పథకాలన్నింటిని ప్రజలకు ధరిచేరేలా చేస్తామన్నారు.దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్‌ను నిలదీస్తామని స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

### అన్ని రంగాలలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం

**చార్మినార్, మార్చి 2 ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలలోను విఫలమైందని హైదరాబాద్ పార్లమెంట నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్‌అన్నారు.పాతబస్తీ పురానాపూల్ చౌరస్తా వద్ద గురువారం బిఆర్ఎస్ నాయకులు పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న పుస్తె శ్రీ కాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను పెంచటం వల్ల ప్రజలపై భారం పడుతున్నదని తెలిపారు.పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎస్‌వి గోపీనాథ్ యాదవ్,మంజుల రాణి,పెండ్యాల లక్ష్మణ్‌రావు, గోపీగౌడ్‌లు పాల్గొన్నారు.

### పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

**చార్మినార్,మార్చి 2 ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలలోను విఫలమైందని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నా రు.మహ్మద్ సలావుద్దీన్ లోధీ ప్రభాతవార్తతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై ఒక్క సారి యాభై రూపాయలు పెంచటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురివుతారని తెలిపారు.గ్యాస్ సిలిండర్ ధరలు పెంచటం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితిగా మారిందని,గృహవసరాల సిలిండర్‌పై 50 రూపాయలు,కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై 350 రూపాయలు పెంచటం చాలా దారుణమైన విషమయని ఆయన తెలియజేశారు.గ్యాస్ సిలిండర్ ధరలు పెరగటంతో అన్ని రకాల తిను బండార వస్తువుల ధరలు పెరుగుతాయని ఆయన తెలిపారు..కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.గ్యాస్ సిలిండర్ ధరలు పెంపుకు నిరసనగా పాతబస్తీలో బిఆర్ఎస్ నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

### గ్యాస్ ధరను తగ్గించాలి : ఎమ్మెల్సీ

**కొంపల్లి, మార్చి 2 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ వరి కింగ్ ప్రెసిడెంట్, ఐటీ పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 44వ జాతీయ రహదారిపై పార్టీ శ్రేణులు గురువారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు గ్యాస్ సిలిండర్‌తో జాతీయ రహదారిపై బైఠాయించి రోడ్డును దిగ్బందించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ గరిశ నరేందర్‌రాజు, బీఆర్ఎస్ నాయకులు నాగరాజుయాదవ్, బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, కొంపల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సన్న కవితయాదవ్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : దేవ వంశీ

**మెహిదీపట్నం, మార్చి 2, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బిజెపి కార్వాన్ నియోజకవర్గ నాయకులు దేవర వంశీ తెలిపారు. గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని బోజగుట్టలో గురువారం దేవర వంశీ పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బస్తీలు, కాలనీలలో నెలకొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. బోజగుట్టలో నెలకొంటున్న డ్రైనేజీ, వాటర్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. స్థానికంగా ఏవైనా సమస్యలుంటే వెంటనే తన దృషికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట బిజెపి నాయకులు బోజగుట్ట వాసులు వెంకటస్వామి, బాలకృష్ణ, బాలస్వామి ఉన్నారు.

## బోర్డు ఎన్నికల్లో 8 స్థానాలు బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుంది

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**కంటోన్మెంట్,మార్చి 2 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో బిఆర్ఎస్ 8 స్థానాలు కైవసం చేసుకొని బోర్డుపై గులాబి జెండా ఎగరవేస్తామని రాష్ట్ర పశుసంవర్ధక,పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మారేడ్‌పల్లిలోని మంత్రి తలససాని నివాసంలో కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముఖ్య నాయకులతో సమావేశమైయ్యారు. కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే సాయన్న మరణించడం బాధకరమని, ఆయన మరణంతో కంటోన్మెంట్‌కు, బిఆర్ఎస్‌కు తీరనిలోటు ఏర్పడిందన్నారు. అటు ఎమ్మెల్యే సాయన్న మరణించడం, ఇటు కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల తేదీ ఖరారు కావడంతో అనుకొని పరిస్థితుల్లో ఎన్నికల ప్రక్రియపై జాప్యం జరిగిందన్నారు. ఆయా వార్డుల నుంచి బిఆర్ఎస్ అభ్యర్థులను ఎంపిక చేయడంపై ప్రజల్లో వారికి ఉన్న సత్‌సంబందాలను ఎవరిని ఎన్నికల బరిలో నిలబెడితే భాగుంటుందన్న అంశాలపై సర్వేలు నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా ఎన్నికల అంశంపై ఈ నెల 10వ తేదీన తనతో పాటు మంత్రి మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మలా (్కజిగిరి పార్లమెంట్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే కూతుర్లు నివేదిత, లాస్య నందితల సమక్షంలో జనరల్ బాడి సమావేశం నిర్వహించి సిఎం కేసిఆర్, మంత్రి కేటిఆర్‌ల సమక్షంలో 8 వార్డులకు అభ్యర్థులను ఖరారు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాల నర్సింహా యాదవ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్. శ్రీనివాస్, సాయన్న కూతుర్లు నివేదిత, లాస్య నందిత, బిఆర్ఎస్ నాయకులు తేజ్‌పాల్, సదానంద్ గౌడ్, పనస సంతోష్, నాగినేని సరిత,సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హోటల్‌లోని ఆహారపదార్థాలు, ఫుడ్ కలర్ వాడుతున్న దృశ్యం

## సురభి హోటల్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

**మెహిదీపట్నం, మార్చి 2, ప్రభాతవార్త :** లంగర్‌హౌస్‌లో ప్రధాన కూడలి వద్ద ఉన్నటువంటి సురభి హోటల్‌లో ఆహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించారు. టిఫిన్‌లో కంకర రాయి వచ్చిందని వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి, సిరాజుద్దీన్‌ల ఆధ్వర్యంలో తనఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో హోటల్‌లోని కిచెన్ అపరిశుభ్రంగా ఉండడంతో పాటు ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు అధికారులు గుర్తించి వాటిని సీజ్ చేశారు. సీజ్ చేసిన ఆహార పదార్థాలను ల్యాబ్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు నగరంలోని ఏ హోటల్ నుంచైనా కొనుగోలు చేసిన ఆహార పదార్థాలపై క్వాలిటీ లేదని అనుమానం వస్తే వెంటనే జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నెంబర్ 040/ 21111111కు గానీ మై జీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా గానీ, ట్విట్టర్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చునని ఫుడ్‌సేఫ్టీ డిగ్నేటెడ్ అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

### ఎఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి

**బేగంబజార్, మార్చి 2ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎ.ఎం.ఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్టర్స్ ఫోరం హెచ్ఎండబ్లు,ఎస్‌బి కార్యదర్శి పోల్కాం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈమేరకు ఆయన మాట్లాడుతూ మహానగరంలో జలమండలి పర్యవేక్షణలో అప్పటికప్పుడు చేపట్టే మెయిన్‌టెన్స్ పనులను కొన్ని సంవత్సరాల తరబడి జలమండలిలోని చిన్న కాంట్రాక్టర్స్ చేపట్టేవారన్నారు.ఈ పనులపై ఎంతో మంది చిన్న కాంట్రాక్టర్స్ కుటుంబాలతోపాటు పరోక్షంగా కార్మికులు ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు.జలమండలి విభాగంలో ఎ.ఎం.ఎస్ విధానాన్ని తీసుకువచ్చి,చిన్న కాంట్రాక్టర ్లను కొలుకొకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వాల హాయంలో కొనసాగిన కాంట్రాక్ట్ పనుల విధానమే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

**కాంట్రాక్టర్‌ను కోలుకోకుండా చేస్తున్న ఎంఎంఎస్...**

బేగంబజార్,మార్చి 2ప్రభాతవార్త:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎ.ఎం.ఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్టర్స్ ఫోరం హెచ్ఎండబ్లు,ఎస్‌బి కార్యదర్శి పోల్కాం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈమేరకు ఆయన మాట్లాడుతూ మహానగరంలో జలమండలి పర్యవేక్షణలో అప్పటికప్పుడు చేపట్టే మెయిన్‌టెన్స్ పనులను కొన్ని సంవత్సరాల తరబడి జలమండలిలోని చిన్న కాంట్రాక్టర్స్ చేపట్టేవారన్నారు.ఈ పనులపై ఎంతో మంది చిన్న కాంట్రాక్టర్స్ కుటుంబాలతోపాటు పరోక్షంగా కార్మికులు ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. జలమండలి విభాగంలో ఎ.ఎం.ఎస్ విధానాన్ని తీసుకువచ్చి,చిన్న కాంట్రాక్టర ్లను కొలుకొకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వాల హాయంలో కొనసాగిన కాంట్రాక్ట్ పనుల విధానమే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### హోంశాఖ మంత్రిని కలిసిన బెంగాలీ సమితి ప్రతినిధులు

**చార్మినార్, మార్చి 2 ప్రభాతవార్త :** రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీని గురువారం పాతబస్తీకి చెందిన తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మందిర నస్కర్,సునీల్ అగర్వాల్,బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సిని వెంటనే ప్రకటించాలంటూ

## 1104 యూనియన్ ధర్నా

**నార్సింగి, మార్చి 2 ప్రభాతవార్త :** 2022.ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అందాల్సిన నూతన వేతనాల జాప్యాన్ని నిరసిస్తూ టిఎస్‌పిఇజెఎసి ఆధ్వర్యంలో మెహిదీపట్నం, నార్సింగి, ఇబ్రహీంబాగ్‌లలోని డిఇ కార్యాలయాల వద్ద 1104.యూనియన్ ప్రతినిధులు ధర్నాలు చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు వ్యక్తం చేశారు. కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు వివిధ రూపాలలో తమ నిరసనను వ్యక్తం చేసి, చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేశారని 1104.యూనియన్ ఉపాధ్యక్షులు యం.భాస్కర్ పేర్కొన్నారు. ఉద్యోగులందరికి ప్రత్యేక కృతజ్ఞతులు తెలుపుతున్నామన్నారు. మార్చి 2.వ,తేదీన డిఇ, జెనరేటింగ్ స్టేషన్ల వద్ద భోజన విరామ సమయాలలో, 3,4.తేదీలలో సరినకల్ ఆఫీస్, కార్పొరేట్ ఆఫీస్, జెనరేటింగ్ స్టేషన్‌ల వద్ద నిరసన ప్రదర్శనలు చేయాలని సూచించారు. ఉద్యోగుల ఐక్యతే మన సమస్యల పరిష్కారానికి ఇంధనమని భాస్కర్ తెలిపారు.

### కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించిన మేయర్

**నిజాంపేట్,మార్చి2 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 27వ డివిజన్ బండారి లేఅవుట్ ఉచిత లైబ్రరీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని గురువారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కంటివెలుగు కేంద్రంలో ఏవైనా సదుపాయాల్లో లోపాలపై వైద్యులను, పరీక్షా కేంద్రానికి వచ్చిన స్థానికులను అడిగి తెలుసు కున్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరికి కవంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ల ను, మందులను పంపిణీ చేయాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జ్యోతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, కాంతారావు, రవీంద్రబాబు, బద్రినారాయణ, నారాయణరావు, రోజా, పార్వతి, రాణి, వైద్యులు శ్రావ్య, శారదా, శంకర్, శ్రవణ్, సిబ్బంది పాల్గొన్నారు.

**సూరారం డివిజన్‌లో**

**హథ్ సే హథ్ జోడో అభియాన్ యాత్ర**

**పేట్‌బషీరాబాద్,మార్చి2 ప్రభాతవార్త:** టీపీసీసీ అధికార ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హథ్ సే హథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా సూరారం డివిజన్ పరిధిలోని శివాలయంనగర్,మస్తాన్ బిల్డర్స్ తదితర ప్రాంతాల్లో గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి బీజేపీ,బీఆర్ఎస్ ప్రభుత్వాల ధ్వంధ్వ వైఖరిని,మోసపూరిత హామీలతో ప్రజలకు చేస్తున్న అన్యాయాలను కరపత్రాల ద్వారా వివరిస్తూ హథ్ సే హథ్ జోడో స్టిక్కర్‌ను ఇంటింటికి అతికించారు.అదే విధంగా కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ఆల్ ఇండియా దళితసేన అధ్యక్షుడు ఆవిజె జేమ్స్, నాయకులు సంజీవరెడ్డి, పండరీరావు, సంతోష్ ముదిరాజ్, శ్రీశైలంయాదవ్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి రాజిరెడ్డి, నవీన్, అబ్బాస్, సలీం, సొహైల్, రజాక్, సురేందర్‌రెడ్డి, సురేష్, మల్లేష్, యాదమ్మ, బేగం, హసీనా, అన్నపూర్ణ, వరలక్ష్మీ, మణెమ్మ, సువర్ణ, మంజుల, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, మార్చి 2, ప్రభాతవార్త :** చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన సంద్రు పెంటయ్య కొన్ని రోజుల క్రితంమృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులకు అదే గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 2000-2001 పదవతరగతి విద్యార్థులు బాదిత కుటుంబ సభ్యులకు రూ.50వేల గురువారం ఆర్థిక సహాయం అందించారు.

## సాత్విక్ మృతికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలి

**ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



నార్సింగిలో సాత్విక్ ఆత్మహత్య పట్ల దీక్ష చేస్తున్న ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**నార్సింగి, మార్చి 2 ప్రభాతవార్త :** శ్రీచైతన్య యాజమాన్యంతో పాటు నార్సింగి శాఖలో పని చేస్తున్న నలుగురిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని కాంగ్రెస్ ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నార్సింగిలోని శ్రీచైతన్య కళాశాల వద్ద వెంకట్‌రెడ్డి దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియతో మాట్లాడుతూ బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సాత్విక్ ఆత్మహత్యపై ప్రసార సాధనాలలో చూపించిన వార్త చూసి కంట నీళ్లు ఆగడం లేదన్నారు. ఇంత ఘోరం జరిగితే ఎందుకు కాబోయే సీఎం అని చెప్పుకునే, ట్విట్టర్ మంత్రి కేటీఆర్ స్పందించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కాదు మన రాష్ట్రంలో కళాశాల ఉద్యోగుల టార్చర్ వలన ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్న విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు కవిత స్పందించడం లేదన్నారు. నార్సింగి ఏసీపీ నిందితులపై కేసు విషయంలో మీడియాతో మాట్లాడిన తీరు బాధాకరంగా ఉందన్నారు. సిబ్బంది తీరుతోనే తాను చనిపోతున్నట్లు మృతుడు స్పష్టంగా సూసైడ్ నోట్‌లో రాసినా ఇంకా విచారణ చేపడుతాం అంటూ డొంక తిరుగుడు మాట్లాడడం దారుణమన్నారు. ఆయన మాటలు వింటుంటే శ్రీచైతన్యలో పార్టనర్ మాట్లాడినట్లు ఉన్నాయన్నారు. నిందితులను పోలీసులే దాచి పెట్టడం సిగ్గు చేటన్నారు. సర్కారు బడుల్లోనే చదువుకొని వందలాది మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, గూగుల్ వంటి దిగ్గ సంస్థలకు సీఇఓలుగా పని చేస్తున్నారన్నారు. పక్క రాష్ట్రంలో ప్రశ్నాపత్రాల లీకేజీపై దోషిగా చేసి నారాయణ సంస్థల అధినేతను అరెస్టు చేసి జైలుకు తరలించారని, తెలంగాణలో మాత్రం కార్పోరేట్ విద్యాలయాలకు మేలు జరిగేలా మన పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో 9.ఏళ్ల టీఆర్ఎస్ పరిపాలన కాలంలో 7.వేల పాఠశాలలు మూతపడ్డాయని,60.వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ అయినా ఎందుకు ఒక్క డిఎస్‌సి వేయలేదని ప్రశ్నించారు. ఇదంతా కార్పోరేట్ విద్యాలయాలకు లబ్ది చేకూర్చడం కాదా అని కోమటిరెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో ఎన్ని కార్పోరేట్ విద్యాలయాలున్నాయి? వాటిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు? విద్యార్థుల నుంచి ఎన్ని లక్షలు వసూలు చేస్తున్నారు? ఆ డబ్బులకు ఐటి చెల్లిస్తున్నారా? అన్న విషయాలన్నింటిని వెలికి తీయాలని ఢిల్లీలోని చీఫ్ ఐటీ అధికారిని కలిసి కోరుతానని స్పష్టం చేశారు. సాత్విక్ మరణంను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని, బాధితుడికి న్యాయం, బాధ్యులకు శిక్ష పడేలా పోరాడుతామన్నారు. తెలంగాణలో అసలు హోం మంత్రి ఉన్నాడా? అన్న అనుమానం కలుగుతుందన్నారు. ఆయన చెబితే ఓ కానిస్టేబుల్ కూడా వినేలా లేదన్నారు. నార్సింగి పోలీసులు ఎంపి అన్న కనీస ప్రోటోకాల్ కూడా పాటించడం లేదన్నారు. సాత్విక్ మరణంపై వెంటనే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు స్పందించి సత్వర న్యాయం చేయాలని ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై పోరాటం : కాంగ్రెస్

**ఉప్పల్, మార్చి 2 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్శనం వినోద్ ముదిరాజ్ అధ్యక్షతన హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి తదితరులు పాల్గొని యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంటింటికి పాదయాత్ర చేపట్టిందని, రాబోయే ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీ ఓటమి తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా పేదలకు చేసిందేమి లేదన్నారు. ఈ సందర్భంగా రామంతాపూర్ టివి స్టూడియో, నల్ల పోచమ్మ ఆలయం నుంచి గణేష్‌నగర్, పాశం సత్తయ్యకాలనీ, గోఖలేనగర్, ఆర్‌టిసి కాలనీ, శారదనగర్ తదితర ప్రాంతాల మీదుగా సాగింది. కరపత్రాలు పంపిణీ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పత్తికుమార్, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, కాలేరు జైనవీన్, మేడల మల్లికార్జున్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మేకల భాస్కర్‌రెడ్డి, పి.అంజయ్య, వి.సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌శెట్టి, సంజయ్‌జైన్, అబ్దుల్ రషీద్, గణేష్‌నాయక్, ఉమేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, షేక్ మదర్‌వలీ, బూర్గుల రమేష్‌గౌడ్, దాసరి కృష్ణ, బొట్టు రాజేష్, రాజ్యలక్ష్మి, సుదర్శన్, సద్గుణరావు, కృర సాయి, వంజరి సంతోష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

**డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్**

**అల్వాల్, మార్చి 2 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమాన్ని విస్మరించి బిఆర్ఎస్ పాలన సాగిస్తోందని డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ విమర్శించారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని కౌకూర్‌లో రెండవ రోజు హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను హరిజన బస్తీ పించన్ పుర సంజయ్ గాంధీనగర్ తదితర ప్రాంతాలులో కొనసాగించారు. పింఛన్‌లు రావడం లేదని నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను బస్తీ దవఖానాగా మార్చాలని రోడ్లు మంచినీరు డ్రైనేజీ డబుల్ బెడ్‌రూము ఇళ్ళు సమస్యలను ప్రజలు ఏకరవు పెట్టారు. తెలంగాణా వెలిగి పోతోందని చంకలు గుద్దుకుంటున్న ప్రభుత్వం వాస్తవ రూపంలోకి రావాలని నందికంటి శ్రీధర్ తెలిపారు. తొమ్మిది ఏళ్ళ పాలనలో పేద మద్య తరగతి ప్రజలు జీవన విధానంలో ఎటువంటి మార్పు లేదన్నారు. ప్రజలు మద్యకు వస్తే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయన్నారు. నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల క్రీడలు కోసం స్టేడియం ఇప్పటి వరకు లేదని వివరించారు. కాంగ్రెస్ హయాంలో ప్రధానంగా ప్రజలు సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీకి చరమగీతం పాడాలని కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు డోలి రమేస్ చంద్రశేఖర్ నిమ్మ అశోక్‌రెడ్డి పాండు రాజలింగం పవన్ సత్యనారాయణ శ్రీనివాస్ గౌడ్ వీనస్ మేంరిఆ పద్మ ఆషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటం : శంకర్‌రావు

**ధర్నాచౌక్, మార్చి 2, ప్రభాతవార్త:** బీజేపీ కార్నర్ మీటింగ్‌లలో వెలుగులోకి వచ్చిన ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పోరాటం చేస్తామని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సీ.కే.శంకర్‌రావు తెలిపారు. గురువారం భోలక్‌పూర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో 83 బీజేపీ కార్నర్ మీటింగ్ ప్రజా గోస-బీజేపీ భరోసా పేరుతో నిర్వహించామని అన్నారు. ప్రజలు రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, పింఛన్లు, మంచినీరు, డ్రైనేజీ, అస్తవ్యస్తమైన రోడ్లు తదితర అంశాలపై ఫిర్యాదులు చేశారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ, జలమండలి కార్యాలయాల వద్ద ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత విద్య, వైద్యంతోపాటు పక్కాగృహాలు ప్రధాన మోదీ సహకారంతో అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి చంద్రమోహన్, దళితమోర్చా ఉపాధ్యక్షులు ఈ.కృష్ణ, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఆర్.రవికుమార్, నాయకులు ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి పన్ను పెంపుపై ఎలాంటి దుష్ప్రచారాలను నమ్మొద్దు

**నిజాంపేట్,మార్చి2 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు పెంచుతున్నట్లు జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో గత సంవత్సరం నిర్వహించిన సర్వే ప్రకారం 2019 డిసెంబర్‌కు పూర్వము నిర్మాణాలు చేపట్టి పన్నులు చెల్లించుచున్న భవనాలకు ఎలాంటి అపరాధ రుసుము విధించడంలేదని తెలిపారు. ఒకవేళ పొరపాటున పాత భవన నిర్మాణదారులకు అపరాధ రుసుము విధించబడినట్లయితే కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ మేళ కార్యక్రమంలో చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కావున కార్పొరేషన్ ప్రజలు ఎలాంటి దుష్ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని కార్పొరేషన్ తెలిపింది.

### ఘనఘనంగా ఎంఐఎం పార్టీ 65వ వ్యవస్థాపక దినోత్సవం

**చార్మినార్,మార్చి 2 ప్రభాతవార్త :** దారుసలాంలో గురువారం ఎంఐఎం పార్టీ 65వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది.ఎంఐఎం అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పార్టీ పతాకాని ్న ఎగురు వేశారు.ఈ సందర్భంగా ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ పాతనగరం అభివృద్ధి కోసం ఎంఐఎం నిరంతరం కృషి చేస్తున్నదని తెలిపారు.ఎంఐఎం శాసన పక్ష నాయకులు,ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ,ఎంఐఎం ప్రధాన కార్యదర్శి,యాకుత్‌పుర నియోజకవర్గం శాసన సభ్యులు సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి,చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్,మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఐఎం అధినేత,ఎంపి అసదుద్దీన్ ఓవైసీ,ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్,సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రి తదితరులు

చిన్న చెరువులో దూకి

## నీట్ విద్యార్థిని ఆత్మహత్య

**ఉప్పల్, మార్చి 2 ప్రభాతవార్త :** రామంతాపూర్ చిన్న చెరువులో దూకి ఒక నీట్ పరీక్షలకు సిద్దమవుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... రామంతాపూర్ ఇందిరానగర్‌లో నివసించే గుడిబోయిన రవిప్రసాద్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రవిప్రసాద్, సునీతలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే రెండో కుమార్తె అనూష 19 నీట్ పరీక్షల కోసం ఫీజు చెల్లించిందని తెలిపారు. అయితే గత రెండు నెలలుగా పరీక్షలకు సరిగ్గా చదువుకోకుండా నిర్లక్ష్యం చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆమెను చదువుకోమని మందలించినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత అందరూ నిద్రకు ఉపక్రమించడంతో అనూష ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయినట్లు తెలిపారు. బుధవారం ఉదయం చుట్టూ ప్రక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి సునీత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. యువతి ఆత్మహత్యకు పాల్పడిందా, లేక మరేదైనా జరిగిందా అనే విషయంలో పలు కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బాలుడిపై యువకులు దాడి

మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 2 ప్రభాతవార్త : ఓ మైనర్ బాలుడిపై కొంత మంది యువకులు దాడి జరిపిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఇన్‌స్పెక్టర్ మధు కథనం ప్రకారం...దానిమ్మ గుడిసెలు ప్రాంతానికి చెందిన సమీర్ అనే మైనర్ బాలుడు కిరాణా దుకాణంలో కూర్చున్నాడు.అదే సమయంలో షాపు వద్దకు వచ్చిన ఐదుగురు యువకులు సమీర్‌ను సమీపంలో ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి డబ్బులు అడిగారు.సమీర్ డబ్బులు ఇవ్వక పోవటంతో ఐదుగురు యువకులు సమీర్‌ను కర్రలు,బెల్టతో కొట్టి గాయపరిచారు.గాయాల పాలైన మైనర్ బాలుడు సమీర్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.మహ్మద్ సైఫ్,అబ్బూ,సమీర్‌తోపాటు మరో కొంతమందిపై కుటుంబసభ్యులు మైలార్‌దేవ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసును మైలార్‌దేవ్ పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నియంత పాలనను తలపిస్తున్న మోడి పాలన : ఎమ్మెల్యే


ఎల్‌బినగర్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న దేవిరెడ్డి, నాయకులు

**మన్సూరాబాద్, మార్చి 2 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకకపోతే ప్రజలే తగిన విధంగా బుద్ధి చెప్పే రోజు వస్తుందని, అదానికి లబ్ధి చేకూర్చడానికే గ్యాస్‌ధరల పెంపు అని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దుయ్యబట్టారు. పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా ఎల్‌బినగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు, మహిళలు పెద్దఎత్తున వినూత్నంగా నిరసన చేపట్టి ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ ఆయిల్ కంపెనీలకు లక్షల కోట్లు సబ్సిడీలు ఇస్తూ ఆడబిడ్డలకు వేలకోట్లు ఆర్థిక భారాలు కల్పిస్తున్న మోడి ఒక నియంతలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మోడి, బిజెపి ప్రభుత్వంపై ఎవ్వరైనా ఆరోపణలు చేస్తే వెంటనే మోడి త్రివిధ ధళాలైన ఈడి, సిబిఐ, ఐటి అధికారులు దాడులు చేస్తూ భయబ్రాంతులకు గురిచేయడం అన్యాయమన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని లేకుంటే ప్రజాగ్రహానికి గురికావడం తథ్యమని హెచ్చరించారు. వినూత్నంగా నానాబెట్టిన బియ్యం, శనగలు, పచ్చిమిరపకాయ, ఉల్లిపాయలను ఎమ్మెల్యేతో పాటు నాయకులు తింటూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సేలు బొగ్గారపు దయానంద్, యెగ్గె మల్లేశం, కార్పొరేటర్ సుజాతనాయక్, నాయకులు కొప్పుల విఠల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పద్మానాయక్, సాగర్‌రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరల పెంపుకు నిరసనగా బిఆర్ఎస్ నేతల ధర్నా


గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, మార్చి 2 ప్రభాతవార్త :** గ్యాస్ ధరల పెంచుతూ కేంద్ర ప్రభుత్వంతీసుకున్న వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉప్పల్ చౌరస్తాలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, ఎంబిజి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, వేముల సంతోష్‌రెడ్డి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మూడు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే గ్యాస్ ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం పేదలపై భారం మోపడం తగదన్నారు. నిరుపేదలపై గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో భారీగా పన్నులు వేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి పాలనలో పేదలకు చేసిందేమి లేదన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉప్పల్ చౌరస్తాలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గరిక సుధాకర్, డివిజన్ అధ్యక్షులు వేముల సంతోష్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, డా.బి.వి.చారి, నేతలు మహిపాల్‌రెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి, చింతల నరసింహారెడ్డి, పిట్టల నరేష్, కొంపల్లి రవీందర్, కె.జగన్, కొండల్‌రెడ్డి, నాయకురాళ్లు రాణిరెడ్డి, అనితరెడ్డి, హేమలత, జీనత్‌బేగం, పాతిమా తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు విద్య దూరం చేయవద్దు : సామ రంగారెడ్డి


ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న సామ రంగారెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, నిరుపేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చర్యలు చేపట్టాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టి ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. మౌలిక వసతుల లేమి, విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడం, సరైన తరగతి గదులు లేకపోవడంవంటి సమస్యలు ప్రభుత్వ పాఠశాలను వెంటాడుతున్నాయన్నారు. ఒక్క తరగతిగదిలో పరిమితికిమించి విద్యార్థులను కూర్చోబెట్టడం వల్ల విద్యార్థులు పాఠశాలకు రావాలంటేనే అయిష్టతను చూపే పరిస్థితి నెలకొందన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, ఉన్నచోట అపరిశుభ్రంగా ఉన్నాయని, స్వీపర్లు లేకపోవడంతో చెత్త చెదారంతో పాఠశాలలు మురికి కూపాలుగా మారుతున్నాయన్నారు. ఇటీవల సరూర్‌నగర్‌లో విద్యార్థినులు టాయిలెట్లకు వెళ్లకుండా ఉండేందుకు ట్యాబ్లెట్లు వేసుకుని పాఠశాలకు వస్తున్న ఘటనలు వెలుగు చూశాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ పట్ల తగిన శ్రద్ధ చూపకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుంటే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, దాసరి జయ ప్రకాష్, కృష్ణవేణి, అంజన్‌కుమార్‌గౌడ్, నూతి శ్రీనివాస్, రామేశ్వర్, రవిశంకర్, కృష్ణంరాజు, కవితరెడ్డి, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో వీధి కుక్కలను కట్టడి చేయాలి: కార్పొరేటర్ అరుణ


డిసికి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో వీధి కుక్కలను కట్టడి చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి గురువారం డిసి జయంత్‌ను కోరారు. కుక్కలు ఎక్కువగా ఉండడంవల్ల చిన్నపిల్లలు భయాందోళనలకు గురవుతున్నారని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిసిని కోరారు. కార్యక్రమంలో వెటర్నరి అధికారులు పాల్గొన్నారు.

## నేడు హాత్ సే హాత్ జోడో యాత్ర : పున్న గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, మార్చి 2 ప్రభాతవార్త :** ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తా నుండి శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గడపగడపకు తిరిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీతో పాటు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి: సీపీఐ


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, మహిళలు

**హయత్‌నగర్,మార్చి 2 ప్రభాతవార్త:** కేంద్రంలో మోడి సర్కారు గ్యాస్ ధరలను పెంచి పేదవాడి నడ్డీ విరుస్తోందని సీపీఐ రాష్ట్రకమిటీ కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి మండిపడ్డారు. వంటగ్యాస్ ధరలపెంపును నిరసిస్తూ గురువారం సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్ కమిటీ ఆధ్వర్యంలో రావినారాయణరెడ్డి కాలనీ చౌరస్తాలో సిలిండర్లతో నిరసనప్రదర్శన నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి వంటగ్యాస్ సిలిండర్ ధర 400 రూపాయలు ఉండగా... ప్రస్తుతం 1200 వరకు చేశారని దుయ్యబట్టారు. పేదల స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాలచారి,నర్సింహ, దాసరి ప్రసాద్, నారాయణ, నవనీత, అరుణ, పుల్లయ్య, సుజాత, దేవమ్మ పాల్గొన్నారు.

## సిసి కెమరాలు ఏర్పాటుకు వినతి


సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను కోరుతున్న లింగాల హరిగౌడ్ తదితరులు

**సైదాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** గడ్డి అన్నారం విలేజ్‌లో సిసి కెమరాలను ఏర్పాటు చేయాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను బిజెపి ఓబిసిమోర్చా మీడియా ప్రతినిధి లింగాల హరిగౌడ్ కోరారు. తాము చేసిన విజ్ఞప్తికి ఇన్‌స్పెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సిసి కెమరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలపడం జరిగిందని హరిగౌడ్ పేర్కొన్నారు. సిసి కెమరాలు శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్రను పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లోకేష్, రాజేందర్‌జోషి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిఫెన్స్ కాలనీ హరి హర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయం పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**సైదాబాద్, మార్చి 2 ప్రభాతవార్త:** డిఫెన్స్ కాలనీలోని శ్రీ హరి హర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయం పుష్కర బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు శ్రీ లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు పుష్కర బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు సోమవారం సాయంత్రం ఏకశిలా పదునెట్టాంబడిపై మహాపడి పూజను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ వ్యవస్థాపకుడు, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

## ఉపాధ్యా ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనార్ధన్‌రెడ్డిని గెలిపించాలి

**హయత్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి కాటేపల్లి జనార్ధన్‌రెడ్డిని గెలిపించాలని పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ పత్రికా సంపాదకులు పున్‌రెడ్డి వెంకట్‌రెడ్డి,సత్తిరెడ్డి కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు గురువారం హయత్‌నగర్‌లో జనార్ధన్‌రెడ్డికి మద్ధతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం ఎమ్మెల్సీగా జనార్ధన్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. ఉపాధ్యాయులకు పిల్లల సంరక్షణ సెలవులు, పీఆర్‌సీలో 30 శాతం ఫిట్‌మెంట్ ఇప్పించడంలో జనార్ధన్‌రెడ్డి పాత్ర కీలకమన్నారు. ఉపాధ్యాయులకు ఈహెచ్‌ఎస్ అమలయ్యేలా కృషిచేస్తున్నారని, పీఈటీల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సత్తారి రాజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి : హోంమంత్రి


ధర్నా నిర్వహిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

**మలక్‌పేట, మార్చి 2 ప్రభాతవార్త :** పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపుమేరకు మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి హోంమంత్రి హాజరై నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్ర ప్రభుత్వానికి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం గ్యాస్, పెట్రోల్ ధరలతోపాటు నిత్యావసర ధరలను పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ దేశ వ్యాప్తంగా విస్తరించి కెసిఆర్ ప్రధాని అయి ప్రజల కష్టాలను తీరుస్తారని ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు సుదర్శన్, హయత్ హుస్సేన్ హబీబ్, లాయఖ్ అలీ, జగన్, చల్లూరి రఘునందన్‌రెడ్డి, తీగల అజిత్‌రెడ్డి, గౌర శశిధర్, మారుతి, వంజరి ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన పోలీసు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా : సీపి చౌహాన్..


మృతి చెందిన పోలీసు కుటుంబాలకు భద్రత ఎక్స్‌గ్రేషియాను అందిస్తున్న రాచకొండ పోలీస్ కమీషనర్ ఎస్. చౌహాన్..

**నేరెడ్‌మెట్, మార్చి 2 ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తూ మృతి చెందిన పోలీసుకుటుంబాలకు గురువారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో రాచకొండ పోలీస్ కమీషనర్ చౌహాన్ భద్రత, ఎక్స్ గ్రేషియా చెక్కులను అందించారు. కమీషనరేట్ పరిధిలోని పోచంపల్లి పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్స్ పెక్టర్‌గా పనిచేస్తున్న జాన్సన్, మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నరేష్‌కుమార్ ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలకు భద్రత నుండి రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఎంతో భాధ్యతతో కూడిందని, వాటిలో ఉన్న ఇబ్బందులు, ఒడిదుడుకులను అధిగమించి పనిచేసే యోధుడే ఒక మంచి పోలీసని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసిపి అడ్మిన్ నర్మద, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 290 బస్సులను భాగ్యలత, శారదానగర్ మీదుగా నడపాలి


డిపో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** కరోనా సమయంలో కాలనీల నుంచి నిలిపివేసిన బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి డిపో అధికారులు శ్రీనివాస్, శారదకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హయత్‌నగర్-సికింద్రాబాద్ 290 రూట్ బస్సులు గతంలో భాగ్యలతకాలనీ, శారదానగర్, గణేష్‌టెంపుల్, పనామా మీదుగా తిరిగేవని తెలిపారు. కరోనా సమయంలో బస్సుల సంఖ్యను తగ్గించడంతో పాటు పనామా నుంచి సుష్మ మీదుగా హయత్‌నగర్ నడిపిస్తున్నారని వివరించారు. దీంతో సుమారు 25 కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. 290 రూట్ బస్సులను గతంలోలాగే నడిపించాలని, కోటి వెళ్లే బస్సులను కూడా సమయానుకూలంగా శారదనగర్, గణేష్‌టెంపుల్ మీదుగా నడపాలని కోరారు. ముదిరాజ్ కాలనీ నుంచి ఉదయం, సాయంత్రం బస్సులను నడపాలన్నారు.

## కురుమనగర్ అభివృద్ధికి చర్యలు : కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి


ఉప్పల్ కురుమనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 2 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్‌హిల్స్,కురుమనగర్, లక్ష్మి నరసింహాకాలనీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కురుమనగర్, ఉప్పల్‌హిల్స్, లక్ష్మినరసింహాకాలనీ తదితర ప్రాంతాలకు మంచినీటి సదుపాయం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. మిగిలిన ఇళ్లకు కూడా త్వరలోనే నీటి సౌకర్యం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు అబ్బయ్య, దుర్గం నవీన్, గోవింద్‌కుమార్, స్వామి, సుధాకర్, గోవర్ధన్,రాంచందర్, రాజుచారి, రమేష్, ఎల్లయ్యగౌడ్, యాదగిరి, అమృత, బిక్షపతి, కొమరయ్య, గోపిగౌడ్, రాజయ్య, నరేందర్, ఉమా, సంధ్య, సుబ్బారెడ్డి, కుమార్, వినోద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ పెంపుకు నిరసనగా మంత్రి ఆధ్వర్యంలో నిరసన

**సరూర్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి పాలనలో వంట గ్యాస్ ధరలు భారీగా పెరగడంపై మహేశ్వరం నియోజకవర్గంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. పెరిగిన వంటగ్యాస్ ధరలను నిరసిస్తూ సాక్షాత్తు మంత్రే రోడ్డు మీదకు వచ్చి మహిళలతో కలిసి ఆందోళన చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జిల్లెలగూడ చెరువు కట్ట నుండి మీర్‌పేట్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున మహిళలు, బిఆర్ఎస్ శ్రేణులు మంత్రితో కలిసి కదం తొక్కారు. ఈ సందర్భంగా మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్ల కార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరల పెంపును తీవ్రంగా నిరసిస్తూ ఏకంగా కట్టెల మోపు నెత్తిన పెట్టుకొని మంత్రి పాదయాత్ర చేయడం గమనార్హం. మంత్రి ఆధ్వర్యంలో గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ చేపట్టిన ఆందోళన విజయవంతం అయ్యింది. ర్యాలీ అనంతరం మీర్‌పేట్ చౌరస్తాలో మంత్రి ప్రసంగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మార్చి 8న మహిళా దినోత్సవం ముందు గ్యాస్ ధరలను పెంచి మోడీ మహిళలకు కానుక ఇచ్చారని మంత్రి ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో కమలం వైపు చూస్తే కట్టెల పొయ్యే దిక్కవుతుందని ఆమె ప్రజలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు పద్మారెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లార్డ్స్ బీరప్ప, ఎనుగుల అనిల్ కుమార్, జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్, మాదరి సురేఖ రమేష్, ధరంకార్ జ్యోతి కిశోర్, విజయలక్ష్మి రాజు, వేముల నర్సింహ, ఇంద్రావత్ రవినాయక్, సౌందర్య విజయ్, సిద్దాల పద్మ అంజయ్య, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, పల్లె పాండు గౌడ్, సిద్దాల బాలప్ప, వంటేరు నర్సింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.


మోడి ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్న మంత్రి సబితారెడ్డి

## రోడ్లను నీటితో కడిగితే చర్యలు

**హయత్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** రోడ్లను నీటితో కడిగితే జరిమానా విధిస్తామని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కాలనీ వాసులను హెచ్చరించారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే మహిళలు రోడ్లను పైపులు పెట్టి నీటితో కడగడం వల్ల నీరు వృధా అవడంతోపాటు ఖాళీ ప్రదేశాలలో నీరుచేరి మురుగు, దుర్గంధం వ్యాపింపచేసి, నీటిలో దోమలుచేరి కాలనీవాసులు అనారోగ్యం భారిన పడే ప్రమాదముందన్నారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆయనకు పలు సమస్యలను వివరించారు. వాటిపై స్పందించిన కార్పొరేటర్ వీలైనవాటికి వెంటనే పరిష్కారం చూపడంతోపాటు మిగిలినవాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కళ్లెం శంకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బిక్షపతి యాదవ్, రాంరెడ్డి, కడారి యాదగిరి, నవీన్‌గుప్త, సాయిరాం గౌడ్ పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్పలో బిజెపి స్ట్రీట్ కార్నర్ మీటింగ్

**సరూర్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో బిజెపి శక్తికేంద్రం ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ టిఆర్ఎస్ పాలనపై ధ్వజమెత్తి కేంద్రంలోని మోడి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిడి శూరకర్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పేద వధువులకు ఉప్పల చేయూత

**ఎల్.బి.నగర్, మార్చి 2 ప్రభాతవార్త :** పేద వధువులకు ఉప్పల ఫౌండేషన్ అండగా నిలుస్తుంది అని ఉప్పల ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఉప్పల స్వప్నశ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. తల్లిదండ్రులులేని అనాథ వధువు పెళ్లికి అవసరమైన పుస్తె మట్టెలు, దుస్తులను ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. మలక్‌పేటకి చెందిన తల్లిదండ్రులు లేని అనాథ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఆమెకు సహకారం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెఫ్ అండ్ డమ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవిఎన్‌రెడ్డికి శంకర్‌రెడ్డి మద్దతు

**సరూర్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న డిపిఎస్ విద్యా సంస్థల అధినేత ఎవిఎన్ రెడ్డికి రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలువురితో ఎవిఎన్‌రెడ్డిని కలిసి సన్మానించి మద్దతు తెలిపారు. అనంతరం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎవిఎన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరచి గెలిపించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, జిట్టా సురేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌ముదిరాజ్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి కృషి : హబీబ్

**మలక్‌పేట, మార్చి 2 ప్రభాతవార్త :** విద్యార్థుల అందుబాటులోఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని చావుని డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు హయ్యత్ హుస్సేన్ హబీబ్ పేర్కొన్నారు. అక్బర్‌బాగ్ ఉజలేష ఈద్గా మదరసాలో ఆయన విద్యార్థులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో హోంమంత్రి మహమూద్ అలీ తోడ్పాటుతో విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## రోడ్డు విస్తరణ ప్లాన్‌ను మార్చాలి : బబిత

**మలక్‌పేట, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ ప్లాన్‌ను మార్చాలని తెలంగాణ జాగృతి హైదరాబాద్ కన్వీనర్ నల్లపు బబిత పేర్కొన్నారు. మలక్‌పేట రైస్ మిల్స్ రోడ్డునుండి ఆనంద్‌నగర్ వెంబడి చంచల్‌గూడకు ట్రాఫిక్‌ను మళ్లించడానికి ప్రభుత్వం ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ ప్లాన్ మార్చాలని స్థానికులతో కలిసి మలక్‌పేట ఎమ్మెల్యే బలాలను కలిసి అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు విస్తరణ వల్ల ఈ ప్రాంతంలో 60 నుండి 80 శాతం స్థానికులు ఇల్లను కోల్పోతారని, ప్లాన్‌కు ప్రత్యామ్నాయంగా ముంతాజ్ కాలేజ్ రోడ్డు వద్ద విస్తరణ పనులు చేపడితే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే బలాల స్పందించి సంఘటనా ప్రాంతాన్ని సందర్శించి తగిన చర్యలు చేపడతామని హామీనిచ్చారని ఆమె తెలిపారు.

## వాజ్‌పేయి నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్‌కు అంతరాయం

**నేరెడ్‌మెట్, మార్చి 2 ప్రభాతవార్త:** విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఇఇ ఎన్. గోపాల్ పేర్కొన్నారు. వాజ్‌పేయి నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు కొట్టివేత కారణంగా అంబేద్కర్ నగర్, వినోభ నగర్, టెలికం కాలనీ, శివనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నాం 12.30 వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

## మోడీ, కెసిఆర్‌ల పాలన కంటే కాంగ్రెస్ ప్రభుత్వమే నయం: యెల్మేటి


ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 2 ప్రభాతవార్త:** వంట గ్యాస్ ధరలను అమాంతం పెంచిన మోడీ ప్రభుత్వ పాలనలో సామాన్యులు బతుకులు భారంగా మారాయని టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన వంట గ్యాస్ ధరలను నిరసిస్తూ గురువారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మల్లాపూర్ చౌరస్తాలో అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మోడి దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గుతాయని భావిస్తున్న తరుణంలో ఏకంగా రూ. 50 పెంచడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడి, రాష్ట్రంలో కెసిఆర్‌ల పాలన కంటే గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే నయమనే భావనకు ప్రజలు వచ్చారని అన్నారు. కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అమ్మద్ బామ్, డిసిసి మాజీ కార్యదర్శి వంగేటి మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు, ఉమేష్, సాయిగౌడ్, సల్మాన్, అద్మాన్, అజ్మల్, ఖలీల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : రామకృష్ణనంద్


కార్యాలయంవద్ద ఆందోళన నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

**మలక్‌పేట,మార్చి 2 ప్రభాతవార్త :** విద్యుత్‌ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సౌత్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరి రామకృష్ణనంద్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జెఎసి పిలుపు మేరకు అస్మాన్ ఘడ్ విద్యుత్ కార్యాలయంలో 2వ రోజు భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి సమస్యల గురించి సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిఇ హనుమంతరెడ్డి, నాయకులు స్వామిగౌడ్, రాము, సుభాష్, హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను తరిమి కొట్టాలి : రామ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 2 ప్రభాతవార్త :** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి పార్టీ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పనిచేస్తుందని ఆరోపించారు. నిత్యవసర వస్తువుల ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులపై భారంమోపుతూ గ్యాస్‌సిలిండర్ ధరను పెంచడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ హాయంలో రూ. 410 ఉన్న సిలిండర్ ధర నేడు రూ.1155 పెంచారన్నారు. తెలంగాణలో కరెంటు బిల్లు, బస్‌చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర ధరలను నియంత్రించి ప్రజలకు అండగా నిలుస్తుందని అన్నారు.

## వీధి కుక్కల బెడద అరికట్టేందుకు చర్యలు : కార్పొరేటర్ శ్రీవాణి


వీధి కుక్కలను పట్టివేత కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శ్రీవాణి

**రామంతాపూర్, మార్చి 2 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో వీధి కుక్కల బెడద అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ నెహ్రూ నగర్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు జిహెచ్ఎంసి వెటర్నరీ ఆఫీసర్ జీవ్యనాయక్ తదితరులతో కలిసి పలు ప్రాంతాల్లో వీధికుక్కల పట్టివేతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో వీధి కుక్కల బెడద అరికట్టేందుకు జిహెచ్ఎంసి తగు చర్యలు తీసుకుంటుందని, వీధికుక్కలనుంచి చిన్నారులను రక్షించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కలు ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.